క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

ముప్పాళ్ల: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ మాదల ఫీడర్‌లైన్‌లో మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 11న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ జీ సుచరిత గురువారం తెలిపారు. ఫీడర్ పరిధిలోని రామకృష్ణాపురం, మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు ఈ నెల 11న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ సత్తెనపల్లి డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11.00 గంటల నుంచి 12.00 గంటల వరకు డయల్ యువర్ డీఎం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 9959225429 నంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలకు పెంచాలి

సత్తెనపల్లి: న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలకు పెంచాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ గురువారం కోరారు. ఈ మేరకు ఏపీ బార్ కౌన్సిల్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ బార్ కౌన్సిల్ అడ్వకేట్ డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలకు పెంపుదల చేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ కూడా ఏపీ న్యాయవాదులకు డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు చెల్లించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌ఆర్‌కేహెచ్ స్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ



అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూలులో 1981–82 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు చేగు ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో గురువారం మైక్‌సెట్, ఇన్వర్టర్, ప్రింటర్‌లను పాఠశాలకు బహూకరించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.విజయకు రూ.40 వేల ఇన్వర్టర్, రూ.20 వేల మైక్‌సెట్, రూ.20 వేల ప్రింటర్‌ను అందచేశారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరటానికి పునాదిగా నిలిచిన పాఠశాలకు పూర్వ విద్యార్థులు వెన్నుదన్నుగా నిలవటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కన్నెధార కోటేశ్వరరావు, గాలి కోటేశ్వరరావు, వాసిపల్లి వెంకటరెడ్డి, దారా ప్రసాదు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 80 శాతం పూర్తి చేశాం



సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని, ఇప్పటికి 80 శాతం హామీలను పూర్తి చేశామని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కూటమి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బృగుబండ గ్రామంలో పర్యటించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందిస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని మై టీడీపీ యాప్‌లో నమోదు చేసి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో పర్యటన ఆద్యంతం పోలీస్ పహారా నడుమ సాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూతపడిన దొడ్లేరు సీజీజీబీ



దొడ్లేరు(క్రోసూరు): బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టుకున్న బాధితులు తమ సొమ్ములు గోల్‌మాల్ జరిగి 22 నెలలు కావస్తున్నా బ్యాంకు అధికారులు సమస్య పరిష్కరించటం లేదని బ్యాంకు అధికారులను లోనికి వెళ్లకుండా అడ్డుకొని ఆందోళన చేపట్టడంతో దొడ్లేరు సీజీజీబీ గురువారం మూతపడింది. రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా గోల్డ్‌లోన్ బాధితులు ఆందోళన చేపట్టారు. ఈ నెల 7న బ్యాంకు రీజనల్ మేనేజర్, జనరల్ మేనేజరు పోలీసుల సమక్షంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ పరిష్కారం కాకపోవడంతో బాధితులు బ్యాంకు తెరవకుండా అధికారులను అడ్డుకున్నారు. దీంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మేనేజరు శివశంకర్ నాయక్ తెలిపారు. దీనిపై బాధితులతో మాట్లాడేందుకు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు రానున్నట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు.



సత్తెనపల్లిలో అన్నప్రసాద వితరణలో భక్తులు



హారతి అందుకుంటున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లిలో వాసవీ అమ్మవారికి ఆషాడ సారె సమర్పణ

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు

- భక్తులతో కిటకిటలాడిన సాయినాథుని ఆలయాలు
- పలు చోట్ల అమ్మవార్లకు, గ్రామ దేవతలకు ఆషాడ సారె సమర్పణ
- అమ్మవార్లకు శాకంబరిగా అలంకరణలు

సమాజానికి జ్ఞానప్రదాత గురువు .. మానవుని భవితకు బంగారు బాటలు వేసే నిర్దేశకుడు గురువు .. అలాంటి గురువులను స్మరించుకుంటూ ఏటా ఆషాడ మాసం శుక్లపక్ష శుద్ధ పౌర్ణమి నాడు గురుపూజోత్సవం నిర్వహిస్తుంటారు. గురుపౌర్ణమినే వ్యాస పౌర్ణమి అని కూడా అంటారు. గురువారం వైభవంగా గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులతో సాయినాథుని ఆలయాలు కిటకిటలాడాయి.

సత్తెనపల్లి: వ్యాసమహర్షి జయంతి (గురుపూర్ణిమ)ను పురస్కరించుకొని గురువారం సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్ వ్యాప్తంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. సాయిబాబా, దక్షిణామూర్తి, దత్తాత్రేయుని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథునికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, భజనలు, సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, అన్నప్రసాద వితరణ, సాయినాథునికి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలోని షిరిడి సాయిబాబా మందిరం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ సమీపంలోని షిరిడి సాయిబాబా మందిరం, పాత బస్టాండ్‌లోని షిరిడి సాయిబాబా మందిరం, రఘురాంనగర్‌లోని షిరిడి సాయిబాబా మందిరం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయంలో మేధో దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల వద్ద గల సాయిబాబా మందిరానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని తరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, రఘురాంనగర్‌లోని సాయిబాబా మందిరాల్లో పూజలకు స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం గురుపూర్ణిమ వేడుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నందిగామ గ్రామంలోని సాయిబాబా మందిరంలో సాయినాథుని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కీర్తిశేషులు ఆళ్ళ కోటేశ్వరరావు జ్ఞాపకార్థం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పెదకూరపాడు సాయిబాబా దేవాలయంలో మహిళలు

శాకంబరిగా దుర్గా అన్నపూర్ణ

సత్తెనపల్లి: దేశం, రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని.. పాడి పంటలతో రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో .. ఆయురారోగ్యాలతో ఉండేలా చల్లగా చూడమ్మా శాకంబరిదేవి అంటూ పట్టణ అచ్చంపేటరోడ్డులోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆషాడ మాస పౌర్ణమిని పురస్కరించుకొని దుర్గా అన్నపూర్ణ దేవిని శాకంబరిగా గురువారం అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

పెదకూరపాడులో గురుపౌర్ణమి

పెదకూరపాడు : మండల వ్యాప్తంగా గురువారం గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెదకూరపాడు, అబ్బరాజుపాలెం, 75 తాళ్లూరు, లగడపాడు గ్రామాలలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో సాయినాథుని ఆలయాలకు చేరుకొని స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాడ సారె

సత్తెనపల్లి: ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠం నుంచి గురూజీ వెలిదండ్ల హనుమత్ స్వామి వారి ఆధ్వర్యంలో శిష్యులందరూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి మన సారె మనసారా గురువారం సమర్పించారు. త్రి శక్తి దుర్గా పీఠం నుంచి బయలుదేరి ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకొని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారెను సమర్పించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చాగంటివారిపాలెం, మాదల గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బాబా వారి గ్రామోత్సవం నిర్వహించారు.

నకరికల్లులో...

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల సున్నపుబట్టి వద్ద గల భగవాన్ వెంకయ్యస్వామి, గురు దత్తాత్రేయస్వామి, శ్రీ షిరిడీ సాయి ఆలయాల్లో గురుపౌర్ణమిని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు తుంగతుర్తి ఫణీ ఆధ్వర్యంలో ఆలయ ప్రదక్షిణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, రుద్రక్రమార్చన, స్వామి వార్లకు అభిషేకాలు చేశారు. స్వామివార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



సత్తెనపల్లిలో శాకంబరిదేవి అలంకరణలో దుర్గా అన్నపూర్ణ



విశేష అలంకరణలో చల్లగుండ్లలోని షిరిడీ సాయిబాబా



సత్తెనపల్లిలో సాయినాథుని దర్శించుకుంటున్న భక్తులు



చాగంటివారిపాలెంలోని సాయిబాబా మందిరంలో...

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన పీటీఎంలో ముఖ్య అతిథిగా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నియోజకవర్గంలోని పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే ప్రవీణ్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, తహసీల్దార్ డానియేల్, ఎంఈవో శివబాబు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, అధికారులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

నకరికల్లు: కేజీబీవీ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని ప్రిన్సిపాల్ లక్ష్మి అన్నారు. మెగా పేరెంట్స్ మీట్ 2.0 కార్యక్రమాన్ని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. కేజీబీవీలో పీటీఎం సందర్భంగా విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ గుజ్జుల శకుంతల, ఉపాధ్యాయులు, తల్లులు పాల్గొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన ఎంపీపీ మెయిన్ పాఠశాలలో పీటీఎంకు ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీఏ స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ మాట్లాడారు. చిన్ని ప్రసన్న విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో ఎనిమిదేళ్లు పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు మొహమ్మద్ రిజ్వానాను సన్మానించారు. డిప్యూటీ డీఈఓ ఏసుబాబు, డిప్యూటి తహశీల్దార్ కొండారెడ్డి, డాక్టర్ హసీనా, న్యాయవాది అలీబాషా తదితరులు పాల్గొన్నారు.



వేల్పూరు జెడ్పీ హైస్కూలులో గ్రేడింగ్ చేసిన విద్యార్థులతో పేరెంట్స్, ఉపాధ్యాయులు

పీటీఎంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక జెడ్పీహైస్కూల్‌లో గురువారం నిర్వహించిన పీటీఎంలో ఆయన పాల్గొని ఉత్తమ విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. పాఠశాల తరపున ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ ప్రత్యేకాధికారి ఝాన్సీ, ఎంపీడీఓ జి.కాశయ్య, డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, హెచ్ఎం జాలాది శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, సాగి శ్రీనివాసరావు, న్యాయవాది అలీబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా పీటీఎం సమావేశాలు

అచ్చంపేట: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలు ఏర్పాటు చేయడానికి ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లు మొక్కుబడిగా జరిగాయి. మండలంలో 48 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత, 6 జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉండగా కొన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు హాజరు కాకపోవడం గమనార్హం. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తల్లిదండ్రులను బతిమలాడి రమ్మనమని పిలిచినా రాలేదు. మండలంలోని అతి పెద్ద పాఠశాల 800 మంది విద్యార్థులు కలిగిన జెడ్పీహెచ్ స్కూలులోనూ తల్లిదండ్రులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. సర్పంచ్ జాని హాజరయ్యారు. విద్యార్థుల ప్రసంగాలు కూడా మొక్కుబడిగానే జరిగాయి. వేల్పూరు జిల్లా పరిషత్ హైస్కూలులో ప్రతిభావంతులైన విద్యార్థులను గ్రేడింగ్ చేసి అభినందించారు. సమావేశాలైతే జరిగాయి గానీ అందులో ఆత్మీయత లోపించింది.



నకరికల్లు జెడ్పీ హైస్కూల్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

క్రోసూరులో...

క్రోసూరు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ మీట్‌ను నిర్వహించారు. కేజీబీవీలో ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, అధ్యక్షత వహించారు. ముందుగా తల్లులతో కుర్చీల ఆట ఆడించి, మొక్కలు నాటించారు. ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ పులి మరియమ్మ, వైస్ చైర్మన్ చిలక అశోక్, జెడ్పీటీసీ జమీలగపూర్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు గార్లపాటి దాసు పాల్గొన్నారు. పేరెంట్స్ కమిటీ మెంబర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో.. ప్రిన్సిపాల్ మేరీసూజన్ అధ్యక్షతన మెగా పేరంట్స్ మీట్ నిర్వహించారు. తహసీల్దార్ వీవీ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేరంట్స్ కమిటీ చైర్మన్ మహ్మద్ రఫీ, వైస్ చైర్మన్ సాంబశివరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండలంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. రాజుపాలెం, అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలల్లో తహసీల్దారు దుర్గేష్‌రావు, గణపవరంలో ఎంఈవో మల్లికార్జున శర్మ, కేజీబీవీలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎంఈవో–2 నరసింహారావులు హాజరయ్యారు. నవోదయ, రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో సర్పంచ్ పులిబండ్ల అశోక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్‌లు, తదితరులు పాల్గొన్నారు.



గణపవరం పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో మల్లికార్జున శర్మ

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ గురువారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా పేరెంట్స్‌తో చిన్నారులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం పేరెంట్స్‌కు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఆయా సమావేశాల్లో విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకూరపాడులో పీటీఎం

పెదకూరపాడు: పెదకూరపాడు మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో మెగా పీటీఎం 2.0 సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎం రాయపూడి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో తాడిసెట్టి సత్యనారాయణ, టీడీపీ జిల్లా కార్యదర్శి ఆర్తిమళ్ల రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రొటేరియన్, ఉపాధ్యాయుడు శీలంనేని సాంబశివరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వారు పాఠశాలకు మంచినీటి సదుపాయం కల్పిస్తామని చెప్పారని, ఏర్పాటుకు తన వంతు సహాయం చేయగా, మాజీ మండల అధ్యక్షులు గళ్ళా బాబురావు, ఏటుకూరి బ్రహ్మయ్య, వడ్లమూడి అప్పారావు, ఆంధ్ర ప్రసాద్, నేలపాటి శ్రీనివాసరావు తమ వంతు సహకారం ప్రకటించారు. జిల్లా టీడీపీ మహిళా కార్యదర్శి షేక్ ముంతాజ్, సర్పంచ్ గుడిపూడి రాజు, నీటి సంఘాల అధ్యక్షుడు వడ్లమూడి అప్పారావు, క్రోసూరు మార్కెటింగ్‌యార్డ్ చైర్మన్ బెల్లంకొండ రామగోపాలరావు, ఎంపీటీసీ కంచర్ల నిర్మల, ఏఎంసీ చైర్మన్ కనకపూడి మరియమ్మ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల జాన్ బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

క్రోసూరు: క్రోసూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నాణ్యమైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి



నకరికల్లు: నాణ్యమైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి సాధించవచ్చని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.రామారావు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా మండలంలోని నర్సింగపాడు వద్ద బఫెలో బ్రీడింగ్ సెంటర్‌లో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పశుపోషణ లాభసాటిగా మార్చేందుకు రైతులు పోషకాలు కలిగిన పశుగ్రాసాన్ని పాడి గేదెలకు మేతగా వేయాలన్నారు. ఏపీబీఎన్ సీఓ–04, సూపర్, స్మార్ట్, రెడ్ నేపియర్ వంటి అధిక దిగుబడినిచ్చే పశుగ్రాసాల గురించి వివరించారు. చాప్ కట్టర్ ద్వారా గడ్డిని కత్తిరించే విధానాన్ని ప్రాక్టికల్‌గా వివరించారు. ఐసీఏఆర్–ఎన్ఐఏఎన్‌పీ యాప్‌ను ఉపయోగించి శాస్త్రీయ పద్ధతిలో పచ్చి, ఎండుగడ్డి కాన్సన్‌ట్రేట్ ఆహారం ఇచ్చే గేదె పాలను బట్టి అవసరాల గణన, వాటి ప్రాముఖ్యతలను వివరించారు. కార్యక్రమంలో నకరికల్లు ఏరియా వెటర్నరీ ఏడీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు నాయక్, వైఆర్‌బీసీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ జి.కిరణ్‌కుమార్, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ వంశీప్రసాద్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సాయిమహేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసాయ.. విష్ణురూపాయ!

అమరావతి: సాక్షాత్తు శ్రీమహావిష్ణువే ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపించి అందరికీ మార్గదర్శకంగా నిలిచే గురువుగా, వేదవ్యాసుడిగా అవతరించాడని భవఘ్ని గురూజీ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం భవఘ్ని ఆరామంలోని వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో గురుపూర్ణిమ వేడుకలలో చివరి రోజున వ్యాసఆరాధన ఘనంగా నిర్వహించారు. భవఘ్ని గురూజీ మాట్లాడుతూ వేద వ్యాసుడు నాలుగువేదాలు, అష్టాదశ పురాణాలతో పాటు మహాభారతాన్ని మానవాళికి అందించాడన్నారు. గురువులను స్మరించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వ్యాస భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భవఘ్ని గురూజీ

సాయిబాబా మందిరంలో...

అమరావతి షిర్డీసాయి–పర్తిసాయి కపోతేశ్వర ధ్యాన మందిరంలో గురుపూర్ణిమ వేడుకలను గురువారం నిర్వహించారు. బాబా వారికి సుప్రభాతసేవ, నగర సంకీర్తన, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోరా..!?

రాజుపాలెం: మండలంలోని గత ప్రభుత్వంలో నిరుపేదలకు ఇచ్చిన జగనన్న ప్లాట్లు ఆక్రమణదారులు ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు, చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పట్టాదారులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ముడుపులు చెల్లించబట్టే పట్టించుకోవడం లేదని పట్టాదారులు వాపోతున్నారు. మండల కేంద్రమైన రాజుపాలెంలో పులిచింతల నిర్వాసిత కేంద్రానికి సమీపంలో 66 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి లే అవుట్ తయారు చేశారు. లే అవుట్ తయారు చేసే సమయంలో సుమారు పది సెంట్లు స్థలంను బడి, గుడి, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ సెంటర్, హెల్త్ సెంటర్ నిర్మించుకునేందుకు కేటాయించారు. కానీ ఆక్రమణదారులు టీడీపీ నాయకుల అండదండలతో ఆ స్థలంను ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం నాయకులకు భయపడి ఆ ఇంటి జోలికే వెళ్లడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇంటి నిర్మాణాన్ని ఆపే విధంగా చర్యలు చేపట్టాలని పట్టాదారులు కోరుతున్నారు.